

# మానస పుత్రిక

అవసరాల నారాయణరావ్

**ముందుగా పాఠకులకు ఒక ముఖ్య మనవి:**

**ఈ రచనలోని కథా వస్తువు బ్రిటన్‌కి చెందినది. కేవలం రచనా, పఠనా సౌలభ్యం కోసం ఈ వస్తువుని తెలుగు వాతావరణంలో చిత్రీకరించి, యాద్గిరి పాత్రను ప్రవేశపెట్టడం జరిగింది. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా దృష్టిలో పెట్టుకోవలసిందిగా ప్రత్యేక ప్రార్థన.**

పదిహేను దేశాలు సభ్యులుగా ఉన్న యూరోపియన్ యూనియన్‌లో పెద్ద వివాదానికి దారి తీసి తీవ్ర సంక్షోభాన్ని, సంచలనాన్నీ సృష్టించి మానవజాతి మనుగడకే పెద్ద ముప్పుగా పరిణమించేదిగా భయోత్పాతాన్ని కలిగించిన విషయం దానికి సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన అంశాలను వెల్లడి చేస్తూ దఫ దఫాలుగా కొన్ని ప్రముఖ దిన, వార, పక్ష, మాస పత్రికలలో ప్రచురితం అయిన న్యూస్ ఐటమ్స్ ఈ రచనకు స్ఫూర్తి.

ఉన్నట్లుండి ఓ శుభోదయాన...బ్రహ్మదేవుడి బుర్రలో ఓ బుద్ధి పుట్టింది!

'గొర్రెల కాపరిలాంటి ఓ పామరుడి బుర్రలో, అసాధారణమైన మేధను అమర్చి పెడితే ఎలా వుంటుంది?'

ఇదీ వాడికి పుట్టిన బుద్ధి!

బ్రహ్మ దేవుడు సృష్టి కర్త. వాడు తల్చుకుంటే, ఎంతసేపు కావాలి!?

★ ★ ★

తూర్పు దిక్కున కొండ చాటునుంచి సూర్యుడు కొత్తగా కాపురానికొచ్చిన పెళ్లాం పక్కలోంచి అయిష్టంగా లేస్తూన్న మొగుడిలా పైకి లేస్తున్నాడు.

ఇంధనం పడితేనేగాని, ఇంజను కదల్దు! కాఫీ పడితే గాని మనిషి కదల్దు!! పోర్టికోలో కుర్చీలు వేసుకుని, నేనూ మా ఆవిడా కూర్చున్నాం.


మా దృష్టి తూర్పు వైపే ఉంది. కాఫీ పడాలంటే పాలు కావాలి. పాలు కావాలంటే యాద్గిరి రావాలి.

యాద్గిరి తూర్పు వైపు నుంచే వస్తాడు. పాలగిన్నె పక్కన పెట్టుకుని, మేం ఎదురు చూస్తున్నాం. వెనకాల క్యారియర్‌కు అటూ ఇటూ రెండు పెద్ద క్యాన్లూ, హాండిల్ బార్‌కు అటు పక్కా, ఇటు పక్కా ఇంకో రెండు చిన్న క్యాన్లూ తగిలించుకుని కిర్రకిర్రుమని చప్పుడవుతున్న డొక్కు సైకిల్‌ని తొక్కుకుంటూ వస్తున్నాడు యాద్గిరి.

“అదిగోనే, మన మేనేజింగ్ డైరెక్టర్‌గారు వచ్చేశారు!” యాద్గిరి దగ్గరకు రాగానే వెటకారం ఆడాను.

“మీ నోటి సలవ వల్ల నేనెప్పుడో ఒక రోజున నిజంగానే అంతటోణ్ణి అయిపోతాను సూత్తాఉండండి! అప్పుడు మీరందరూ నన్ను సూసి, నిన్న మొన్నటి దాకా మనకి పాలు పోసిన యాద్గిరేనా వీడూ!? అని ఆశ్చర్యపోతారు. ఎందుకంటే, అప్పుడు ఈడు సూటూ, బూటూ, టై ఏసుకుని మారుతీ కార్లో తిరుగుతా ఉంటాడు.”

“దేవుని దయవల్ల నువ్వు అంతటి వాడవైతే మా కంటే ఎక్కువ సంతోషించే వాళ్లు ఇంకొకళ్లు ఉండరు యాద్గిరీ!” గిన్నెలో పాలు పోయించుకుంటూ అంది మా ఆవిడ.




‘నేల మీద మడిసి సేత అనిపించి ఆకాశం మీంచి దేవుడు తదాత్తు అంటాడట అమ్మగోరూ!’

చనువు కొద్దీ నేను ఎప్పుడైనా వేళాకోళంగా ఏదైనా అంటే యాద్గిరి కోపం చేసుకునేవాడు కాదు. తోస్తే రెండు ముక్కలు జవాబుగా చెప్పేవాడు, లేకపోతే నవ్వుకుంటూ వెళ్లిపోయేవాడు.

ముతక పంచె, సైను గుడ్డ చొక్కా, బనీను, పై మీద ఓ తుండుగుడ్డ, తల మీద చిన్న పాగా - ఇవీ నలభై అయిదేళ్ల యాద్గిరంటే. దశాబ్దకాలం నుంచి, మా కాలనీ కాలనీ అంతా యాద్గిరి దగ్గరే పాలు పోయించుకోటానికి కారణం అతగాడి మంచితనమే. పాలు చిక్కగా పోసేవాడు. మాకు వెన్న, నెయ్యీ ఖర్చు కూడా అందులోనే పోయేది. యాద్గిరికి మొదట్లో అయిదారావులే ఉండేవి. పదేళ్లలో వాటిని ఓ పెద్ద మంద చేశాడు.

★ ★ ★

రోజులాగే, పొద్దున్నే పోర్టికోలో కుర్చీ వేసుక్కూర్చున్నాం, నేనూ మా ఆవిడా పాలకోసం అని. ఫర్లాంగు దూరంనుంచే, సుదీర్ఘంగా హారన్ మోగించుకుంటూ దర్జాగా స్కూటర్ మీద కూర్చుని, దర్పం ఒలకపోస్తూ వస్తున్నాడు యాద్గిరి.

మమ్మల్ని సమీపించగానే సడెన్ బ్రేక్ వేసి ఆపి, రెండు కాళ్లనూ నేల మీద ఆనించి నించుంటూ “మానేజింగ్ డైరెక్టరుగా రొచ్చారు, పాలు పోయించుకోండి!” అన్నాడు. చూపుల్లో చిరుగర్వం నృత్యం చేస్తోంది! కొత్త స్కూటర్!! దానికి అటూ ఇటూ లావుపాటి తాళ్లతో కట్టిన రెండు పెద్ద క్యాన్లు, కాళ్లు పెట్టుకునే చోట ఇంకో రెండు చిన్న క్యాన్లు.

పదేళ్లుగా రోజా కిర్రుకిర్రుమని చప్పుడు చేసుకుంటూ డొక్కు సైకిల్ మీద వచ్చే యాద్గిరిని చూడటం అలవాటయిన మాకు ఈ కొత్త యాద్గిరిని చూడగానే ఆశ్చర్యం వేసింది.

“అయితే... త్వరలోనే సొంత డెయిరీఫారం ఒకటి పెట్టేసి, పాడి పరిశ్రమలో ఓ మేనేజింగ్ డైరెక్టర్ అయిపోయే శుభదినం వచ్చిందన్నమాట!” ఆశ్చర్యపోతూ అన్నాను.

“మా ఆవుల మంద సల్లగా సూత్తే, అదెంత సేపు సారూ!” యాద్గిరి చాలా ధీమాగా అన్నాడు.

“శుభం!... కాని, మమ్మల్ని మరచిపోకేం?”

“ఎంతమాట?... నే నిప్పుడు ఇట్టా ఉన్నానంటే, మీ సలవే కదా సారూ, ఎట్టా మరచిపోతాను?” అలా అయిదేళ్లు స్కూటర్ మీద పట్టుకొచ్చి పాలు పోశాడు యాద్గిరి. రెండేసేళ్లకు కొత్త స్కూటర్ మీద వచ్చేవాడు.

“ఏం యాద్గిరీ, వ్యాపారం బాగుందనుకుంటానే, రెండేసేళ్లకు ఓ కొత్త బండి మీద వస్తున్నావ్!?” ఓ రోజున అడిగాను.

“రోజూ మోసుకొచ్చే బరువూ, తిరిగే తిరుగుడూ తక్కువా సారూ? ఈ యాపారంలో ఏ బండయినా రెండేళ్ల కంటే ఎక్కువ ఉంచితే, మీకు ఈ యాలపాలు రేపూ, రేపటి పాలు ఎల్లుండే వచ్చేవి!”

“అయితే వ్యాపారం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగుతోందన్నమాట, సంతోషం.”

“దాణా కూడా అలాగే పది రెట్లు అయిపోతంది. అంత పెడితేగాని ఒక్కొక్క ఆవు పొద్దున్న పది లీటర్లూ, సాయంత్రం పది లీటర్లూ ఇవ్వటం గగనమై పోతంది!”

“ఆవులూ, గేదెలూ మనిషి జన్మజన్మలూ ఋణపడి ఉండవలసిన జంతువులు. ఇంత గడ్డి తిని, మనిషికి పుష్టినిచ్చే పాలనిస్తాయ్! ఎంత అవుతుందయ్యా దాణాకి? నువ్వు పెట్టేది బంగారమా ఏమన్నానా? ఇంత గడ్డి, పిడికెడు తవుడూ, దోశెడు చిట్టూ ఇంతే కదా ఎంత పెడితే మాత్రం ఎంత అవుతుంది?’

“మీరు సెప్పిన దాణా పెడితే, అవు రోజుకి రెండు పూటలా కలిపితే, మూడు లీటర్ల పాల కంటే ఎక్కువ ఇవ్వదు. ఈ కొత్త దాణా అలవాటు చేశాక, పూటకు పది లీటర్లు ఇత్తన్నాయంటే, అది ఎంత ఖరీదైనదో ఆలోచించు కోండి!”

“నువ్వు చెప్పింది నమ్మమంటావ్?” కొంచెం వెటకారంగా అన్నాను.

“మాంసం ధర ఎలా భగ్గుమనిపోతందో సూశారా? కిలో ఎనభై రూపాయలు! మనం ఏటి తింటాం? ఆటి కేటి పెట్టాం, సెప్పండి!?” చటుక్కున గేర్ మార్చేసి, స్కూటర్‌ని బర్రున ముందుకి లాగించేశాడు.

“తను తినే మాంసాహారంతో గడ్డీ, గాదాం మేసే ఆ సాధు జంతువులను ముడి పెడతాడెందుకు? అవి ఏమన్నా పులులా, సింహాలా మాంసాహారం తినటానికి!?” వెళ్లిపోతున్న యాద్గిరి వైపు తెల్లబోతూ చూశాను.

★ ★ ★

అంతకు ముందు నెలంతా పోసిన పాలకు కాలనీ వాళ్లందరి దగ్గరా పైసలు వసూలు చేసేసుకుని, మర్నాటి నుంచి చెప్పా పెట్టకుండగా గాయబ్ అయిపోయాడు యాద్గిరి!

ముందు మాట వరుసకయినా మాకు చెప్పాపెట్టకుండా అలా


అర్థాంతరంగా మానేసినందుకు మాకు బాధ, ఇబ్బందీ కలిగాయ్.

యాద్గిరి పాల వ్యాపారం మానెయ్యడు, మానెయ్యలేడు. రాకపోవటానికి బహుశః వేరే కారణాలు ఏమైనా ఉండి ఉండవచ్చు.

నగర శివారులో ఉన్న యాద్గిరి ఇల్లు నాకు తెలుసు. పదిహేనేళ్ల నుంచి పాలు పోస్తున్నాడు. తన ఇంట్లో ఏ శుభ కార్యం వచ్చినా మమ్మల్ని ఆహ్వానించేవాడు. వ్యాపారిగా కంటే, ఒక స్నేహితుడిగానే ఎక్కువగా చూసుకున్నాం యాద్గిరిని. 'స్నేహధర్మంగానైనా ఓసారి వాళ్ల ఇంటికి వెళ్లి చూసి రావచ్చు' అని రోజూ అనుకుంటూ ఉండటం, ఏదో పని తొందరవల్ల అది సాధ్యపడకపోవటం - ఇలా అప్పటికే అయిదారు నెలలైపోయింది. ఓ రోజున ఎలాగో అలా తీరిక చేసుకుని బయలుదేరాను. నే నెరిగిన అతని పెంకుటిల్లు అక్కడ లేదు. దాని స్థానంలో ఓ పేద్ద భవంతి ఉంది.

'బాబూ!... ఇక్కడ పాల వ్యాపారి యాద్గిరి అనే అతను ఉంటూ ఉండాలి. అతను ఇప్పుడు ఎక్కడ ఉంటున్నాడు?' ఆ ప్రాంతం నివాసి ఒకడు ఆ దారిన పోతూంటే అడిగాను.

"ఆ సార్ ఉండేది అదిగో ఆ బిల్డింగ్‌లోనే." నేను చూసిన భవంతి వైపే వేలుపెట్టి చూపించాడు ఆ పాదచారి.




"మార్వెల్ డెయిరీ లిమిటెడ్." ఆ భవంతి టెర్రేస్ మీద ఓ పెద్ద బోర్డ్. గేటు దగ్గర గూర్ఖా. గేటు ముందు పది పదిహేను కార్లూ, ఇరవై ముప్పయ్ ద్విచక్రవాహనాలూ. లోపల్నుంచి బయటికీ, బయట్నుంచి లోపలికీ జనం వస్తున్నారు, పోతున్నారు.

'నేనొహటి అడిగితే, వీడింకొకటి చెప్తాడు.' వేలు పెట్టి చూపెట్టిన పాదచారి మీద విసుక్కుంటూనే ఆ భవంతి దగ్గరకు వెళ్లాను.

"బాబూ!... పాల వ్యాపారి యాద్గిరి ఇల్లు ఎక్కడా?" ఖాకీ బట్టలు వేసుకుని, చేతిలో లాఠీ పట్టుకుని గేటు దగ్గర నించున్న గూర్ఖానడిగాను.

"ముందు అపాయంట్‌మెంట్ తీస్కున్నారా?"

"యాద్గిరి ఏమిటి?... ఈ భవనం ఏమిటి?... అపాయంట్ మెంట్ తీసుకోవటం ఏమిటి!?" నాకు మతిపోయి, అయోమయంలో పడ్డాను.

'ఇదిగో బాబూ! నాక్కావలసింది పాల వ్యాపారి యాద్గిరి' అన్నాను కొంచెం చిరాకుగా.

"అవును సార్! ఆ యాద్గిరి సారే. ముందు అపాయంట్ మెంట్ తీసుకోవాల." వాడూ చిరాకుపడుతూనే జవాబిచ్చాడు.

'వీడెవడో కాని, మన యాద్గిరి మాత్రం అయ్యుండడు. ఇప్పుడు ఏం చెయ్యటం? ఇంత దూరం వచ్చి అనుకున్న పని కాకుండా వెళ్లిపోవటం నాకు ఇష్టం లేదు. ఏ యాద్గిరి అయితేనేం, వచ్చిన నష్టం ఏం ఉంది, ఓసారి చూసేస్తే పోలే,' అని మనసులో అనుకుని, "చూడు బాబూ!... నాకు ముందు అపాయంట్‌మెంట్ తీసుకోవలసిన అవసరం లేదు. అతను నాకు చాలా కాలం నుంచి మిత్రుడు. సిటీ నుంచి సంజీవరావ్‌గారు వచ్చారని చెప్పు, చాలు అంతే!" అన్నాను.

"అడ్డమైనోళ్ల నందర్నీ ఎందుకు లోపలికి తోలేత్తావ్ అని ఆయన నా మీద కోపం సేసుకుంటాడు సార్."

"ఆ సార్ నిన్నేమీ అనకుండా చూసుకునే బాధ్యత నాది, సరేనా? వెళ్లి చెప్పిరా!" యాద్గిరి మీద నాకేదో ప్రత్యేకమైన పట్టు ఉన్నట్లు పోజు కొట్టాను. వాడు ఏమనుకున్నాడోగాని, లోపలికి వెళ్లి వచ్చి నన్ను అనుమతించాడు.

ఎదురుగా లాంజ్‌లో సోఫాలో కూర్చున్న వ్యక్తిని చూసి, నా కళ్లను నేను నమ్మలేకపోయాను. సూటూ, బూటూ టై వేసుకున్నాడు. చాలా ఠీవిగా, దర్జాగా ఉన్నాడు.

'హల్లో యాద్గిరీ!... బాగున్నావా?... చాలా మారిపోయావ్!' వెళ్లి అమాంతంగా కౌగలించుకున్నాను.

"ఇదంతా మీ ఆశీర్వాద బలమే రావ్‌గారూ!... కూర్చోండి!... ఏం తాగుతారు?... కోకా కోలా తెప్పించ మంటారా?... కాఫీనా?... ఏమిటో చెప్పండి!" చాలా ఆప్యాయంగా అడిగాడు యాద్గిరి.

"అవన్నీ ఎందుకులే యాద్గిరీ. చాలా కాలం అయింది. ఓసారి నిన్ను చూసి పోదాం అని మనసు పీకి వచ్చాను."

"మన సార్‌కి పెద్దగ్లాసు నిండా చిక్కటి పాలు పట్టుకు రారా!"

ఎదురుగా చేతులు కట్టుకు నించున్న నౌకరుకి చెప్పి, మళ్లీ నా వైపు తిరిగి, "మీకూ, నాకూ మధ్య నున్నది వ్యాపార సంబంధం కాదు. తెల్లటి పాల బంధం! అందుకనే పాలు తెమ్మన్నాను."

నేను చాలా ముగ్ధుణ్ని అయ్యాను. హోదా, స్థాయీ పెరగటంతో పాటు మనిషిలో ఎంత మార్పు వస్తుంది! కట్టూ, బొట్టూ మారిపోయాయ్. మాట్లాడే తీరూ మారిపోయింది.

"నీ ప్లానింగ్, నీ ప్రాజెక్టు - వీటిని గురించి మాట వరసకయినా ఎప్పుడూ మాతో చెప్పావ్ కాదు."

'నాకు తెలుసు రావుగారూ, మీరు ఏదో రోజున ఈ యాద్గిర్ని వెతుక్కుంటూ వస్తారని. మీకు సర్‌ప్రైజ్ చేద్దాం అనే ముందుగా చెప్పలేదు.' ఆంగ్లపదం వాడినందుకు నాకు నవ్వొచ్చింది.

"అవునుగానీ యాద్గిరీ!... ఈ మార్వెల్ డెయిరీ లిమిటెడ్ ఏమిటి?... ఈ కంపెనీలో పని చేస్తున్నావా?" ఒక్కసారిగా పగలబడి నవ్వాడు యాద్గిరి.

"అయ్యో సారూ!... ఈ కంపెనీ మనదే. మనమే దీనికి మేనేజింగ్ డైరెక్టరిని!... మీరు అంటూండేవారే 'మన మేనేజింగ్ డైరెక్టరుగారొచ్చారు పాలు పోయించుకో' అని. ఆనాటి మీ దీవెనే ఈ మార్వెల్ డెయిరీ లిమిటెడ్! ఇది మా కంపెనీ ఆఫీసు. దీని వెనకాల బిల్డింగ్ మనం ఉండేది... రాండి, మన ఇల్లూ, పారం చూద్దురుగాని." నేను పాలు తాగి, గ్లాసు కింద పెట్టెయ్యగానే యాద్గిరి సోఫాలోంచి లేచాడు.

'చాలా సంతోషం యాద్గిరీ. ఈ వ్యాపారంలో ఇంత వాడివి అయ్యావ్.'

భవంతి సింహద్వారంలో అడుగు పెట్టేసరికి, దగ్గర్లో కట్టేసిన పులుల్లాంటి రెండు ఆల్సేషన్ కుక్కలు చెవులు గళ్లుపడిపోయేలా, గుండెలదిరి పోయేలా అరుచుకుంటూ గొలుసులు గుంజేసుకుంటూ మీద పడిపోయేటంత పని చేశాయ్.

లోపలికి తీసుకు వెళ్లాడు. ఏ గది ఏమిటో చెప్పాడు. బెడ్రూంలో ఎయిర్ కండిషనర్సు. హాలులో టీవీ, వీసిఆర్లు, కిచెన్లో ఫ్రిజ్. మరో గదిలో గోద్రేజ్ కబోర్డులు, బాత్రూంలో గీజర్లు, వాషింగ్ మెషీన్సు - ఇలా ఒకటేమిటి? ఈ ఆధునిక యుగంలో మనిషి సుఖపడటానికి అవసరం అయిన యంత్ర సాధనాలు అన్నీ ఉన్నాయ్. ఓ పెద్ద జమీందార్‌గారి ఇల్లులా ఉంది ఎంతో వైభవంగా.

అక్కణ్ణుంచి, ఎత్తైన కప్పుతో నిర్మించిన పెద్ద షెడ్ల సముదాయానికి తీసుకు వెళ్లాడు. అందులో నాలుగు వరుసల్లో మూడు నాలుగు వందలకు పైగా ఆవులు వాటి మేతకూ, నీళ్ల తాగటానికీ ప్రత్యేకమైన ఏర్పాట్లు.

తరువాత ప్లాంట్‌కి తీసుకు వెళ్లాడు. అక్కడ పాలు ఏఏ ప్రక్రియలో శుద్ధి చేస్తారో, శ్యాచెట్‌లోకి ఎట్లా ఆటోమాటిక్ ఫిల్లింగ్ అవుతుందో శీతలీకరణ ఎక్కడ ఎలా జరుగుతుందో - ఇలా మొత్తం ప్రక్రియనంతా దశల వారీగా చూపించాడు.

"చాలా భారీ ఎత్తు ప్రాజెక్టే. ఏ మాత్రం పెట్టుబడి పెట్టావ్ యాద్గిరి?"

"అబ్బో చాలా పెట్టాను. పాల వ్యాపారం మీద వచ్చిందంతా ఉడ్చి పెట్టాను. భూమీపుట్రా అమ్మేసి అదీ పెట్టాను. మా ఆడదాని ఒంటి మీదివన్నీ ఒల్చి పెట్టేశాను. ఇవన్నీ చాలక బ్యాంకు నుంచి కొంత అప్పు తీసుకున్నాను."

యాద్గిరి అంత ఉచ్ఛస్థితిలో కొచ్చినందుకు హుషారుగా ఇంటికి వచ్చి నా సంతోషాన్ని మా ఆవిడతో పంచుకున్నాను.

పాల వ్యాపారం చేసి, బాగాపైకి వచ్చిన వాళ్లను చెప్పుకోవాలంటే యాద్గిరినే చెప్పుకోవాలయ్యా!"

ఏదో సందర్భం వచ్చి ఒక రోజున వాడుకగా మాకు పాలుపోస్తున్న నర్సింహతో అన్నాను.

"ఆడు చేసే ఎదవ పనులన్నీ సేత్రే మేమూ అంత పెద్దోళ్లం అవుతాం సారూ!"

లైవ్ వైరుని చేత్తో పట్టుకున్నాట్లనిపించి నాకు క్షణం పాటు మెదడంతా మొద్దుబారి పోయింది.

"అదేమిటి నర్సింలూ అలా అంటావ్!... యాద్గిరి చాలా కష్టపడి పైకి వచ్చినవాడు."

"ఆడి సంగతి తెలీనోళ్లకు అలాగే కనిపిత్తాడు సారూ!.. లేకపోతే... గడ్డిగాదం మేసే ఆవులకు మాంసం పెడతారా సెప్పండి?'

"మాంసమా!" నాకు నిజంగానే మతి పోయింది.

"అవును సారూ!".... మాంసమే!" రెట్టించాడు.

ఈర్ష్యాసూయలు ముందు పుట్టి, తరవాత పుట్టాడు మనిషి!

"ఆవులూ, గేదెలూ మాంసం తింటాయా!?.. పులులా, సింహాలా అవి?.. సాధుజంతువులైన ఆవులకు ఎవడైనా మాంసం పెడతాడా? పెడితే మాత్రం అవి తింటాయా ? ఇది నమ్మతగ్గదేనా...

"కాకపోయినా, మాంసం పెట్టడానికి ఒక ఆవా రెండు ఆవులా? వందల్లో ఉన్నాయ్. వాటి అన్నింటికీ మాంసాహారం పెట్టాలంటే సాధ్యమా?...

"రోజూ విధిగా భోజనంలో మాంసాహారం చేసుకుతినే వాళ్లే ఇప్పుడు పక్షానికొకసారి వండుకుని, ఆవకాయ బద్దలా నంజుకు తింటున్నారు.

"ఆపాల వ్యాపారం చేసి పైకి వచ్చినందుకు యాద్గిరి మీద నర్సింలుకి ఎంత కడుపు మంట? అతని మీద ఎంత దుష్ప్రచారం లేపుతున్నాడు. ఒకడు పచ్చగా ఉంటే కళ్లల్లో నిప్పులు పోసుకుంటారు!"

అభివృద్ధి కాంక్ష, లాభాపేక్ష మనిషికి సహజం, వాటితో తపనపుడుతోంది. అది వాణ్ణి లక్ష్యం దిశలో ముందుకు తరుముతుంది. మెదడుని పూరికే ఉండనీయదు. కంటికి కునుకు రానీయదు.

ప్రతీరంగంలోనూ ఉత్పాదకతను పెంచుకోవటం ఒక ఉన్నత ప్రమాణంగా మారిపోయింది.

ఉన్న వనరులనుంచి ఉత్పత్తిని సాధించాలనుకోవటం నేటి ఆధునిక ప్రపంచంయొక్క లక్ష్యం. ఒక ఎకరం భూమిలో పాతిక బస్తాల ధాన్యం దిగుబడి సహజం అయినట్లయితే, ఇక ద్విచక్ర వాహనాల కర్మాగారం ఉత్పాదకతా సామర్థ్యం కోటి అయితే, వాటిని నాలుగింతలు చెయ్యాలని, లక్ష్యం పెట్టుకోవటం ఆ దిశలో ఎన్నో ప్రయోగాలు చేసి, ఎన్నెన్నో కొత్త కొత్త ప్రక్రియలు చేపట్టి, లక్ష్యాన్ని సాధిస్తున్నారు. కొంత మంది గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి కూడా ఎక్కుతున్నారు.

అలాగే బ్రిటన్‌లో పాలూ, మాంసం ఉత్పత్తుల విషయంలోనూ ఇదే మార్గం అనుసరిస్తున్నారు. పాల ఉత్పత్తి పెంపుదల ప్రయోగాలూ, ప్రక్రియలలో ఆద్యుడు యాద్గిరి! అందులో సాధించిన విజయానికి దక్కవలసిన ఘనత కూడా అతనిదే. యాద్గిరిని అనుసరించి దేశంలో ఎంతో మంది పాడి పరిశ్రమలో ఉత్పాదకతను అధికతరం చేసి శ్వేత విప్లవాన్ని తీసుకురావటం జరిగింది.

"అంతు చిక్కని వింత వ్యాధి!
ఆపదలో చిక్కిన పశుజాతి!!"

పతాక శీర్షికతో ఆ వేళ ఓ ప్రముఖ దిన పత్రికలో వార్త! ఆదుర్దాగా ఆ శీర్షిక మీదికి దృష్టి సారించాను.

"నగర శివారులో ఉన్న మార్వెల్ డైయిరీ ఫారంలో ఉన్న ఆవులకు ఏదో అంతుచిక్కని వ్యాధి సోకి రోజూ ఒకటి రెడు ఆవుల చొప్పున చనిపోతూన్నయి. అది ఏం వ్యాధో, దానికి ఏం చికిత్సో పశువైద్యులకూ, శాస్త్రజ్ఞులకూ అంతు పట్టక మథన పడుతున్నారు. వారం రోజుల్లో అప్పుడే అక్కడ పాతిక ముప్పయ్ ఆవుల్దాకా చని పోయినట్లు అంచనా. ఈ విషయంలో యాజమాన్యం చాలా ఆందోళన చెందుతోంది. ఈవ్యాధిని వెంటనే గుర్తించి, తగిన చికిత్సా విధానం కనుగొనకపోతే దేశంలో ఉన్న యావత్ పశు సంపదకూ తీరని ముప్పు తప్పదని ఆ సంస్థ మ్యానేజింగ్ డైరెక్టర్ యాద్గిరి మా పత్రికా విలేఖరుల ముందు వాపోయారు. ఆ వ్యాధి లక్షణాలను శ్రీ యాద్గిరి ఈ విధంగా వివరించారు.

'ఉన్నట్లుండి ఆవులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తించటం మొదలు పెట్టాయ్. నిలబడలేక పోవటం, తూలడం,ఆవెంటనే ఆవులు కిందపడి చనిపోవటం.'

అది చదివి, యాద్గిరి మీద నాకు జాలి వేసింది.

"అయ్యో!....' యాద్గిరికి ఎంత కష్టకాలం వచ్చింది నర్సింలు పాపిష్టి కళ్లు పడ్డాయ్!"


"వింత వ్యాధి గుర్తింపు!
విశ్వశ్వాస్థ్యకు ముప్పు!!"

ఆ రోజు పేపర్లో పతాక శీర్షికతో ఉన్న వార్త కనిపించగానే మార్వెల్ డైయిరీ ఫారం, ఆ ఫారంలోని ఆవులు వింత వ్యాధితో చనిపోవటం వగైరా విషయాలన్నీ నా మనసులో మెదిలాయ్.

ఆదుర్దాగా చదవడం మొదలు పెట్టాను.

"బ్రిటన్‌లో చనిపోయిన ఆవుల మెదళ్లను పరిశీలించగా, అది స్పాంజిలా మెత్తగా ఉందనీ, ఆ పరిణామం మాంసాహార సంబంధ ఉత్పత్తులు దాణాలో కలిపిపెట్టడం వల్లనేనని నిపుణుల పరిశోధనలో తేలింది."

ఆ వ్యాధిపేరు 'బోవినల్ స్పాంజిఫాం ఎన్‌కాఫ్‌లోపతీ (బియెస్‌యి)'గా గుర్తించి నిర్ధారణ చేశారు. దీనినే 'మ్యాడ్ - కౌ - డిసీజ్' అని కూడా అంటున్నారు. ఈ వ్యాధి సోకిన ఆవుల పాలు తాగిన వారికీ, వాటి మాసం తిన్న వారికీ 'సీజేడీ' అనే వ్యాధి వస్తుంది ' ఈ వ్యాధి సోకియుప్పటికే అప్పుడే ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని అనుమానిస్తున్నారు...."



**మానేశా...**

గోవింద: ఓ సిగరెట్ ఉంటే ఇవ్వవోయ్.
ముకుందం: నువ్వు మానేశావని విన్నాను.
గోవిందం : నువ్వు విన్నది నిజమే. కాల్చడంకాదు కొనడం మానేశాను.
ఆర్.డి.యస్. (భాగ్యనగరం)

"ఈ తీవ్ర పరిణామం యూరోప్ అంతటా దిగ్భ్రాంతిని కలిగించింది. సంక్షోభాన్నీ, భయోత్పాతాన్నీ సృష్టించింది. మానవజాతి మనుగడకే పెద్దముప్పు వచ్చి పడింది..."

"యూరోపియన్ యూనియన్ దేశాలు బ్రిటన్ దేశపు పాల ఉత్పత్తులనూ పశు మాంసాన్నీ నిషేధించాయ్. బ్రిటన్ ఎగుమతి చేసే ఇతర ఉత్పత్తులు - అంటే పశువుల ఎముకలను మరగ పెట్టి మరగపెట్టి చల్లారిన గెలటిన్ అనే పదార్థం, తర్వాత జంతువీర్యం వగైరాలనన్నింటినీ నిషేధించాయ్..."

"ఎన్నో రకాల ఉత్పత్తులలో యీగెలెటిన్‌ను వాడతారు. కాస్మెటిక్స్, ఫార్మస్యూటికల్స్, ఐస్‌క్రీం, బిస్కట్సు లాంటి కొన్ని తినే పదార్థాలలో వాడతారు."

యుద్ధ ప్రాతిపదిక మీద ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు చేపట్టారు.

"వివాదంలో మిత్రదేశాలు!

సీజేడీ కోరల్లో జీవులు!!"

దిన పత్రిక

మళ్లీ పతాక శీర్షిక!

"బ్రిటన్‌లో పశుజాతికి సంక్రమించిన 'బియస్‌యి' వ్యాధి మిత్రదేశాల మధ్య పెద్ద వివాదమై పెనుతుఫాను లావీస్తోంది!

"మరో పక్క.... పొంచి యున్న 'సీజెడీ' విపత్తు జనావళి గుండెల్లో అదురు పుట్టిస్తోంది!!

"విస్తృత పరిశోధనల్లో పదనాలుగువేల 'బియస్‌యీ' కేసులు బయట పడినట్లు తేలింది.

"ఈ కారణాల వల్ల ఆయా ఉత్పత్తులను బ్రిటన్ వెంటనే నిలిపి వెయ్యాలనీ, వాటిపై నిషేధాన్ని తీవ్రతరం చేసి, అమలుజరిపేలా చర్య తీసుకోవాలనీ యూరోపియన్ యూనియన్‌లో సభ్యులుగా ఉన్న మిగతా పధ్నాలుగు సభ్యదేశాలూ తీర్మానించి పిలుపు నిచ్చాయ్.

"కాని, బ్రిటన్ ఆ డిమాండు పట్ల సముచితంగా స్పందించలేదు. విషయ తీవ్రతను సరిగ్గా స్వీకరించలేదు. సకాలంలో సరైన చర్యలు చేపట్టలేదు. పైగా, యూరోపియన్ యూనియన్‌లోని దేశాలు సభ్య దేశంపై దురుద్దేశ్యంతో వ్యవహరిస్తున్నాయని ఆరోపించింది. ఇతరసభ్యదేశాల పశుమాసంఅమ్మకాలను పెంచుకునేందుకు చేసిన కుట్రగా బ్రిటన్ అభివర్ణించింది...



వయసు...

"ఇందాకట్నుండీ ఈల వేస్తుంటే ఆగవేమిటి? గద్దించాడు ట్రాఫిక్ పోలీసు

"ఈల వేస్తే ఆగే వయసా నాయనా నాది" అంది ముసలావిడ

ఆర్.డి.యస్. (భాగ్యనగరం)

"యూరోపియన్ యూనియన్ పశుమాంస ఉత్పత్తి ఎనభై లక్షలు కాగా, అందుల్లో బ్రిటన్ ఒక్కటే తొమ్మిదివేల టన్నులను ఉత్పత్తి చేస్తోంది. ఏటా ఎనభై అయిదు కోట్ల డాలర్ల విలువైన పశుమాంసాన్ని ఎగుమతి చేస్తోంది. బ్రిటన్ రైతుల్లో యాభైశాతం మంది ప్రత్యక్ష్యంగానో, పరోక్షంగానో ఈ వ్యాపారంపై జీవనం గడుపుతున్నవారే...

"బియస్‌యి" 'సిజేడి'ల పరిణామాల ఫలితంగా యూరప్‌లో పశు మాంస వినియోగం నలభై శాతానికి పడిపోయింది. ధరలు విపరీతంగా పడిపోయాయ్. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ కారణంగా బ్రిటన్‌కు సభ్య దేశాల మీద పీకల్దాకా ఆగ్రహం కలిగింది. దీంతో, యూనియన్‌లోని సభ్య దేశాలకు సహాయ నిరాకరణకు పూనుకొంది. యూనియన్ దేశాల ఆమోదం కోసం ప్రతి పాదించిన అంశాలను వీటో చెయ్యటం ఆరంభించింది. అందుచేత యూనియన్‌లోని సభ్యదేశాలమధ్య శతృత్వం ఏర్పడింది.

"మరో విషయం : వివాదం తీవ్రతరం కాక ముందు, పెరిగిన పాల ఉపోత్పత్తులకు మార్కెట్ లేదు. అప్పుడు ఆ భారీ నిల్వలను సముద్రంలో పడవేశారు. అసలు ఆ నిల్వలు, పౌష్టికాహారంలేని పేద దేశాల పౌరులకు సరఫరాచెయ్యాలనుకున్నారు. కానీ చివరకు అలా సముద్రం పాలు కావలసి వచ్చింది."

"తప్పిదం మనిషిది!

మూల్యం పశువుది!!"

"పశువుల దాణాలో జంతుమాసం ఉపోత్పత్తులను కలపడంపై నిషేధం విధించిన తేదీకి ముందు పుట్టిన ఆవులన్నింటినీ వధించాలనీ యూనియన్ దేశాలు బ్రిటన్ మీద ఒత్తిడిని తీసుకు వచ్చాయ్. ఆ ఒత్తిడికి ఉక్కిరి బిక్కిరి అయిన బ్రిటన్ ఒప్పుకోక తప్పలేదు. ఈ చర్య వల్ల 'బియస్‌యి'ని, తద్వారా మనుషులకు సంక్రమించే 'సీజేడీ'ని పూర్తిగా నివారించవచ్చుని యూనియన్ దేశాలు భావించాయ్."

అనుకోకుండా ఆవేళ యాద్గిరిని కలుసుకోవటం తటస్థించింది.

"కుశల ప్రశ్నలనంతరం, తన డైయిరీ ఫారం, మ్యాడ్ - కా -డిసీజ్, "నిషేధాలూ, వధలూ వగైరా వగైరా విషయాల గురించి ప్రస్తావించగా, యాద్గిరి చెప్పినదంతా విని, దిగ్భ్రాంతి చెందాను....

ఒక రోజున యాద్గిరి తన డైయిరీ ఫారం కేటల్ షెడ్‌లో కుర్చీ వేసుకుని, చుట్టకాల్చుకుంటూ, ఆవులకేసి చూస్తూ కూర్చున్నాడు. అమాంతంగా వాటి మీద కృతజ్ఞతా భావం ముంచుకొచ్చింది.

"ఆవుల్లారా? మీరెంత మంచోళ్లు!

"మనిషిగాడు అన్నం తిని యిసం కక్కుతాడు!

మీరు గడ్డిమేసి మనిషికి పాలు తాపుతారు!"

అక్కడికొచ్చే సరికి,యాద్గిరి మెదడులో చటుక్కున ఒక మెరుపు లాంటి దేదో హఠాత్తుగా మెరిసింది!

"గడ్డి పెడితేనే రోజుకి నాలుగైదు లీటర్ల పాలు ఇత్తన్నారు గందా. మీకు మాంసం తిన పెడితే ఇంకా ఎన్ని ఎక్కువ పాలు ఇత్తారో గదా! మాంసాహారం ఒంటికి పుష్టి కదా. అందుచేత పాలు ఎక్కువ ఇచ్చి తీరాల."

యాద్గిరి కళ్లల్లో మెరుపు మెరిసింది.

'ఇత్తయ్, ఎందుకియాయ్?... ఓ వారం రోజులు పెట్టి సూత్తే తెలిసిపోద్ది!

యాద్గిరిలో ఉత్సాహం ఉరకలు వేసింది.'

తన ప్రయోగానికి పదిక్రావుల్ని ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్నాడు.

మాంసం దుకాణానికి వెళ్లాడు. యాభైకేజీల మాంసాన్ని కొన్నాడు. పనస పొట్టులా కొట్టించాడు. ఇంటికి పట్టుకు వచ్చి మసాలా అదీ బాగా దట్టించి కమ్మగా వండించి, ఒక్కొక్క అవుకి అయిదుకేజీల చొప్పున దాణాలో కలిపి పెట్టుకుంటూ వచ్చాడు.

ఆ వేళ ఆవులకి లంచీ, డిన్నరూ నాన్ వెజిటేరియన్నే.

మర్నాడు తెల్లవారుతూనే, పాలేరుల్ని లేపాడు.

పాలు పిండించాడు. వాటిని కొలిపించాడు.

ఆ వేళ వచ్చిన పాలు రోజూ కంటే ఇరవై శాతం ఎక్కువ.

'ఈ యాద్గిరి తక్కువ వాడు కాదు. ఆడికీ బుర్రుంది!'

సంబరంతో ఎగిరి గంతేశాడు.

'ఎదవ సచ్చినోణ్ణి!.. ఈ తెలివి తేటలు ఇన్నాళ్లు ఏమైపోయినయ్!? ముందే తట్టి ఉంటే ఈ పాటికి - పెద్ద కుబేరుణ్ణయి పోయేవాణ్ణి!'

తన ప్రయోగాన్ని వారం పదిరోజులకు పొడిగించాడు.

పాల ఉత్పత్తి శాతం రోజురోజుకీ పెరిగి, తొంభై శాతం ఎక్కువైంది.

ఇహ ఆ వేళ్నుంచి భూమ్మీద నడవలేదు యాద్గిరి. ఆకాశంలో మేడలు కట్టేశాడు!

★ ★ ★

తన మానస పుత్రిక వల్ల భూలోకంలో మానవజాతికీ, పశుగణానికీ దాపురించిన ముప్పుకు బ్రహ్మదేవుడు సిగ్గుపడి పశ్చాతాపంతో లెంపలు వేసుకున్నాడు.